అంతా ప్రచారార్భాటం

- స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంక్ కోసం పాకులాట
- నగరాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో నిర్లక్ష్యం
- పూడికతీతకు నోచుకోని పంట కాలువలు


రైతుబజార్ సమీపంలోని పంట కాలువ దుస్థితి

నెల్లూరు(బారకాసు): కేంద్ర ప్రభుత్వం ఏటా నిర్వహించే స్వచ్ఛ సర్వేక్షణ్ పోటీలో ఈ దఫా నెల్లూరు కార్పొరేషన్ ప్రదర్శన ఆశించిన మేర ఉండేలా కనపించడం లేదు. నగరంలో దీని కోసం కూటమి ప్రభుత్వం పడరాని పాట్లు పడుతోంది. సర్వే కోసం సచివాలయ సిబ్బందిపై నగరపాలక సంస్థ అధికారులు ఒత్తిడి తెస్తున్నారు. ప్రజల భాగస్వామ్యంతో చేపట్టాల్సిన ప్రక్రియను సచివాలయ సిబ్బందికి అప్పగించారు. ఇలా ఒక్కో ఉద్యోగి 300 మంది ప్రజల నుంచి ఓటీపీలను సేకరించాలని ఆదేశించారు. అయితే వీటిని చెప్పేందుకు చాలా మంది నిరాకరిస్తున్నారు. అనుకున్న లక్ష్యాన్ని చేరుకోలేక పోయారంటూ సిబ్బందికి నోటీసులు జారీ చేస్తున్నారని సమాచారం.

వాస్తవానికి విరుద్ధంగా..

స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంక్‌ను ఏదో రకంగా సాధించాలనే ఉద్దేశంతో మరో అడుగు ముందుకేసి పొదుపు సంఘాల లీడర్లను పురమాయిస్తున్నారు. వీరు చేస్తున్న ప్రజాభిప్రాయ సేకరణలో ఏ మాత్రం వాస్తవం ఉండటం లేదు. పొదుపు మహిళలకు ఆయా పొదుపు సంఘాల లీడర్లు ఫోన్ చేసి ఓటీపీ వస్తుందని.. అది చెప్పాలని కోరి వెంటనే అప్‌లోడ్ చేస్తున్నారు. అయితే ఈ ప్రక్రియ మొత్తాన్నీ ప్రభుత్వానికి అనుకూలంగా జరుపుతున్నారు. ఇదంతా దేనికని ప్రశ్నిస్తే, స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంక్ కోసమని సమాధానమిస్తున్నారే తప్ప, పూర్తి స్థాయిలో తెలియజేయడంలేదు.

స్పందన నామమాత్రం

నగరంలో ప్రజలకు కల్పించే మౌలిక సదుపాయాలు, అపరిశుభ్రత, చెత్త సేకరణ, తరలింపు, దోమల నియంత్రణ ఇలా పలు అంశాల్లో అధికారుల నిర్లక్ష్యం నెలకొందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఆయా అంశాలపై ప్రజల నుంచి అభిప్రాయాలను సేకరించాల్సి ఉంది. ఫిబ్రవరి 15న ప్రారంభమైన ఈ ప్రక్రియలో ఇప్పటి వరకు దాదాపు 70 వేల మందికిపైగా స్పందించారని తెలుస్తోంది. నగరంలో సుమారు 1.5 లక్షల కుటుంబాలున్నాయి.

పర్యవేక్షణ లోపం

నగరపాలక సంస్థలోని పారిశుధ్య విభాగంలో అనేక మంది అధికారులు, సిబ్బంది పనిచేస్తున్నారు. నగరంలో దాదాపు తొమ్మిది లక్షలకు పైగా జనాభా ఉంది. నగరపాలక సంస్థలో 1500 మందికిపైగా కార్మికులు విధుల్లో ఉన్నారు. 54 డివిజన్లలో ఇంత మంది పని చేస్తున్నా, పారిశుధ్య నిర్వహణ మాత్రం అస్తవ్యస్తంగా మారిందని ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రజారోగ్య విభాగ పర్యవేక్షణ లోపంతో క్షేత్ర స్థాయిలో సమస్యలు ఎదురవుతున్నాయి. దీంతో స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ర్యాంక్ కోసం నగరవాసుల నుంచి అభిప్రాయాలను కోరుతున్నా, స్పందన నామమాత్రంగా ఉంటోంది.

పడకేసిన పారిశుధ్యం

నగరంలోని అనేక ప్రాంతాల్లో ఇళ్ల మధ్యలో పంట కాలువలున్నాయి. వీటి ద్వారా మురుగు పారుదల సక్రమంగా లేదు. పూడిక తీయడాన్ని విస్మరించడంతో చెత్తాచెదారంతో నిండిపోయి దోమలకు ఆవాసాలుగా మారుతున్నాయి. దీంతో విషజ్వరాలు ప్రబలి ప్రజలు ఆస్పత్రుల పాలవుతున్నారు. ఇంటింటి చెత్త సేకరణను నిత్యం చేస్తున్నా, ఆశించిన స్థాయిలో జరగడం లేదనే విమర్శలూ లేకపోలేదు. ఫలితంగా రోడ్లపైనే చెత్తాచెదారం దర్శనమిస్తోంది.


మన్సూర్‌నగర్‌లో ఇలా..

విధులకు సకాలంలో హాజరుకాకపోతే చర్యలు

నెల్లూరు(బారకాసు): పారిశుధ్య పనుల విధులకు సకాలంలో హాజరుకావాలని, లేని పక్షంలో చర్యలు తప్పవని ఎంహెచ్‌ఓ డాక్టర్ చైతన్య స్పష్టం చేశారు. 17వ డివిజన్లోని ధనలక్ష్మీపురం, నారాయణ మెడికల్ కళాశాల రోడ్డు వద్ద చేపట్టిన పారిశుధ్య పనులను ఆదివారం ఆయన పరిశీలించారు. మస్టర్‌ను 5.30కూ ప్రారంభించలేదంటూ డివిజన్ సెక్రటరీలను మందలించారు. 18వ డివిజన్లో తక్కువ సంఖ్యలో కార్మికులు హాజరుకావడాన్ని గమనించారు. ఆదివారం సైతం తగినంత మంది హాజరుకావాలని సూచించారు. శానిటేషన్‌కు సంబంధించిన ప్రతి పనినీ లాగ్ బుక్‌లో పొందుపర్చాలని ఆదేశించారు.

సాయిదర్బార్‌లో రక్తదాన శిబిరం



నెల్లూరు(బృందావనం): బాలాజీనగర్‌లోని సాయిదర్బార్ అద్దాల మందిరంలో గల ద్వారకామాయిలో రక్తదాన శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మందిర కమిటీ చైర్మన్ మధుసాయి మాట్లాడారు. సాయిదర్బార్ యువసేవా దళ్ సభ్యుడు కనుమూరు సాయినాథ్‌రెడ్డి స్మృత్యర్థం కార్యక్రమాన్ని నిర్వహించామని చెప్పారు. 77 యూనిట్ల రక్తాన్ని నోవా బ్లడ్ బ్యాంక్ సేకరించిందని తెలిపారు. మందిర గౌరవ సలహాదారు పాబోలు రామసుబ్బయ్య పాల్గొన్నారు.

క్లుప్తంగా

అలరించిన డ్యాన్స్ పోటీలు



నెల్లూరు(బృందావనం): నగరంలోని పురమందిరంలో కేతా అంకుల్ మెమోరియల్ ట్రస్ట్ వార్షికోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర స్థాయి పాటలు, డ్యాన్స్ పోటీలను జరిపి విజేతలకు బహుమతులను అందజేశారు. తొలుత బయ్యా రమణయ్య, సరోజనమ్మ చిత్రపటాలకు నివాళులర్పించారు. సింహపురి పెయింట్స్ అధినేత కోట గురుబ్రహ్మం, వాకాటి విజయకుమార్‌రెడ్డిని సత్కరించారు. సితార ఈవెంట్స్ ఆర్కెస్ట్రా ఆధ్వర్యంలో నిర్వహించిన సంగీత విభావరి అలరించింది. కృష్ణయ్య, జయకుమార్, సుధారాణి, బుజ్జయ్య తదితరులు ఆలపించిన గీతాలు ఆకట్టుకున్నాయి. నాట్యాచార్యులు డేగల సాంబశివరావు ఆధ్వర్యంలో సిద్ధేంద్రయోగి కూచిపూడి కళాక్షేత్ర విద్యార్థులు ప్రదర్శించిన శాస్త్రీయ నృత్యాలు.. డీజే డ్యాన్స్ అకాడమీ విద్యార్థుల మోడ్రన్ డ్యాన్స్‌లు అలరించాయి. ట్రస్ట్ అధ్యక్షుడు కేతా సుబ్బారావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జయప్రకాష్, ప్రదీప్, పాటూరు శ్రీనివాసులు, దుర్గాప్రసాద్, బలరామయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ మద్యసేవనంపై కన్నెర్ర



నెల్లూరు సిటీ: రూరల్ పరిధిలోని బహిరంగ ప్రదేశాలు, లేఅవుట్లు, ఖాళీ స్థలాల్లో మద్యం సేవించే వారిపై కఠిన చర్యలు చేపడతామని సీఐ వేణు పేర్కొన్నారు. ఈ మేరకు పలు ప్రాంతాల్లో స్పెషల్ డ్రైవ్‌ను ఆదివారం చేపట్టారు. జాతీయ రహదారి సమీపంలోని పద్మావతి గ్రీన్‌సిటీలో బహిరంగంగా మద్యం సేవిస్తున్న 15 మందిని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. ఐదు బైక్‌లను సీజ్ చేశారు. కోర్టులో హాజరుపర్చనున్నామని తెలిపారు.

మాజీ మంత్రి అనిల్‌కు సత్కారం



ఇందుకూరుపేట: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పొలిటికల్ అడ్వైజరీ కమిటీ సభ్యుడిగా నియమితులైన మాజీ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్‌ను నెల్లూరులోని ఆయన నివాసంలో పార్టీ రైతు విభాగ రాష్ట్ర అధికార ప్రతినిధి బట్టేపాటి నరేంద్రరెడ్డి ఆదివారం కలిశారు. ఆయన్ను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలను తెలియజేశారు.


కామాక్షితాయి సేవలో..



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: జొన్నవాడలోని మల్లికార్జున సమేత కామాక్షితాయి అమ్మవారిని విజయవాడ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ చీఫ్ ఇంజినీర్ వెంకటరమణ దంపతులు ఆదివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరిని ఆలయ సిబ్బంది సత్కరించి.. శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలను అందజేశారు.

అగ్నిమాపక సిబ్బంది సేవలు మరువలేనివి

- ఫైర్ ఆఫీసర్ విజయ వరకుమార్


వారోత్సవాల్లో పాల్గొన్న సిబ్బంది

పొదలకూరు: విధి నిర్వహణలో అగ్నిమాపక సిబ్బంది సేవలు మరువలేనివని పొదలకూరు ఫైర్ ఆఫీసర్ విజయ వరకుమార్ అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల ముగింపు సందర్భంగా ఆదివారం చైతన్య స్కూల్ విద్యార్థులు, కిసాన్ క్రాఫ్ట్ సిబ్బందికి డెమో ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాపారులు అగ్నిమాపక చట్టాలను తెలుసుకుని నిబంధనల ప్రకారం వ్యవహరించాల్సిందిగా సూచించారు. ఎవరో చేసే తప్పునకు ఇతరులు నష్టపోవాల్సి వస్తుందన్నారు. కార్యక్రమంలో ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు.

అప్సా కార్యవర్గ ప్రమాణ స్వీకారం


బ్రోచర్ల ఆవిష్కరణ

నెల్లూరు (టౌన్): ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ (అప్సా) జిల్లా, నియోజకవర్గ నూతన కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారాన్ని నగరంలోని జెట్టి శేషారెడ్డి కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించారు.
కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా నారాయణ విద్యాసంస్థల జనరల్ మేనేజర్ వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, అప్సా రాష్ట్ర అధ్యక్షుడు సుబ్రహ్మణ్యరాజు, మాజీ అధ్యక్షుడు సుందరం హాజరయ్యారు. ఈ సందర్భంగా అప్సా బ్రోచర్లను ఆవిష్కరించారు. జిల్లా అధ్యక్షుడిగా కర్తం ప్రతాప్‌రెడ్డి, గౌరవాధ్యక్షుడిగా చాట్ల నరసింహారావుతో పాటు పలువురు ప్రమాణ స్వీకారం చేశారు.

రాష్ట్రస్థాయి చెస్ పోటీలు ప్రారంభం



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ముత్తుకూరు రోడ్డులోని సద్గురు సిల్వర్ ఓక్స్ స్కూల్లో ఉభయ తెలుగు రాష్ట్రాల ఓపెన్ చెస్ పోటీలను రాష్ట్ర చెస్ అసోసియేషన్, ఆనంద్ వింగ్స్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకుడు గోపీనాథ్ మాట్లాడారు. 226 మంది క్రీడాకారులు రిజిస్టర్ చేసుకోగా, వీరిలో 65 మంది ఇంటర్నేషనల్ రేటింగ్ క్రీడాకారులని తెలిపారు. చెస్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి సుమన్, సిల్వర్ ఓక్స్ స్కూల్ డైరెక్టర్లు వెంకటాద్రినాయుడు, షణ్ముఖాచారి, ప్రిన్సిపల్ సుధాకర్, ఇన్‌చార్జి ప్రవీణ్, ఆనంద్ వింగ్స్ చెస్ అకాడమీ డైరెక్టర్ గోపీనాథ్, కోచ్ మధుసూదన్‌రెడ్డి, ఆర్బిటర్లు హుస్సేన్, ప్రదీప్, వెంకటరమణ, రామలక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రాల ఏర్పాటు ఎంతో అవసరం



నెల్లూరు(అర్బన్): వేసవిలో మజ్జిగ చలివేంద్రాలను ఏర్పాటు చేయడం ఎంతో అవసరమని ఏపీ ఎన్జీఓ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మన్నేపల్లి పెంచలరావు పేర్కొన్నారు. దర్గామిట్టలోని ఎన్జీఓ కార్యాలయం వద్ద జీఎస్టీ రోడ్డుపై మజ్జిగ చలివేంద్రాన్ని అసోసియేషన్ నేతలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలువురికి మజ్జిగను అందజేశారు. నేతలు బండారుపల్లి వెంకటేశ్వర్లు, ఓబుల్‌రాజు, రామకృష్ణ, ఆంజనేయవర్మ, లక్కాకుల పెంచలయ్య, కృష్ణంరాజు, రాజేంద్రప్రసాద్, నవోదయ, జానకి, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదభరితంగా విద్యుత్ స్తంభాలు



నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని 54వ డివిజన్ జనార్దన్‌రెడ్డి కాలనీలో విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదభరితంగా మారాయి. ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ ఏర్పాటు చేసిన దిమ్మె ఒరిగిపోయి పడిపోయేందుకు సిద్ధంగా ఉంది. 53వ డివిజన్లోని పలు ప్రాంతాల్లో స్తంభాలు ఒరిగిపోయాయి. ఇవి కూలిపోతే ప్రమాదం సంభవించేందుకు అవకాశం ఉంది. దీనిపై అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

భక్తిశ్రద్ధలతో మహా సౌరయాగం



నెల్లూరు(బృందావనం): భాను సప్తమిని పురస్కరించుకొని మూలాపేటలోని శంకరమఠం ప్రాంగణంలో గల కామాక్షి సమేత చంద్రమౌళీశ్వరస్వామి సన్నిధిలో మహా సౌరయాగాన్ని భక్తిశ్రద్ధలతో ఆదివారం నిర్వహించారు. యాగాన్ని కంచికామకోటి పీఠానికి చెందిన వేదపండితుడు సోమేశ్వరశర్మ ఆధ్వర్యంలో జరిపారు. ఉభయకర్తలుగా చంద్రశేఖర్‌ప్రభు దంపతులు వ్యవహరించారు. మఠం నిర్వాహకులు కొర్రపాటి నందకిశోర్, ఉషాకుమారి దంపతులు పర్యవేక్షించారు.

శాలివాహన విద్యార్థులకు పురస్కారాలు


మాట్లాడుతున్న నేతలు

నెల్లూరు సిటీ: కొత్తూరు సమీపంలోని శాలివాహన సంక్షేమ భవనంలో కమిటీ సభ్యులు ఆదివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా శాలివాహన సంక్షేమ భవన పరిరక్షణ కమిటీ జిల్లా అధ్యక్షుడు తుమ్మలపల్లి మధుసూదన్‌రావు మాట్లాడారు. పదో తరగతి, ఇంటర్‌లో 75 శాతానికిపైగా మార్కులు సాధించిన విద్యార్థులకు పురస్కారాలను అందజేయనున్నామని చెప్పారు. వివరాలకు 83329 11297 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. కమిటీ కార్యదర్శి పెళ్లూరు సుమన్ ప్రజాపతి, కోశాధికారి ఐనకోట రఘురామయ్య, కార్యవర్గ సభ్యులు ఈదూరు మధు, గూడూరు వెంకటేశ్వర్లు, బెజవాడ ఆదిశేషయ్య తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడుకోవాలి


మాట్లాడుతున్న నేతలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): భారత రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడుకునేందుకు లౌకికవాదులు ఏకం కావాల్సిన సమయం ఆసన్నమైందని సీపీఎం, సీపీఐ జిల్లా కార్యదర్శులు మూలం రమేష్, దామా అంకయ్య పిలుపునిచ్చారు. బాలాజీనగర్‌లోని సీపీఎం కార్యాలయంలో విలేకరులతో ఆదివారం వారు మాట్లాడారు. వక్ఫ్ చట్ట సవరణను వ్యతిరేకిస్తూ నగరంలోని జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో జిల్లా స్థాయి సదస్సును మంగళవారం సాయంత్రం ఐదు గంటలకు నిర్వహించనున్నామని, భారీగా తరలిరావాలని కోరారు. సీపీఎం నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు, నేతలు బసవరాజు, మోహన్‌రావు, మాదాల వెంకటేశ్వర్లు, సిరాజ్, మస్తానీ, రషీద్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా సైకిల్ ర్యాలీ



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): క్విట్ ఇండియా సైకిల్ ర్యాలీని నెహ్రూ యువ కేంద్రం, జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్ నుంచి కరెంటాఫీస్ సెంటర్ వరకు ర్యాలీ సాగింది. జిల్లా యువజన అధికారి ఆకుల మహేంద్రరెడ్డి, డీఎస్డీఓ యతిరాజ్ పాల్గొన్నారు.

ఘనంగా ఈస్టర్


డొనీహాల్ బాప్టిస్ట్ చర్చిలో..

నెల్లూరు(బృందావనం): ఈస్టర్ పర్వదినాన్ని నగరంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆత్మకూరు బస్టాండ్ సమీపంలోని ది లోన్‌స్టార్ బాప్టిస్ట్ చర్చిలో ప్రత్యేకారాధనలను మూడు సర్వీసుల్లో జరిపారు.

- వీఆర్సీ సెంటర్ సమీపంలోని బాప్టిస్ట్ చర్చి డొనీ హాల్లో పునరుత్థాన ఆరాధనను కార్యదర్శి గుర్రం అరుణ్‌కుమార్ నేతృత్వంలో నిర్వహించారు. సంఘ కాపరి రెవరెండ్ శ్యామ్‌సన్‌కుమార్ వాక్యోపదేశం చేశారు. అనంతరం నూతన విశ్వాసులను సంఘంలోకి చేర్చుకున్నారు. క్వైర్ బృందం ఆలపించిన గీతాలు అలరించాయి. తొలుత చేపట్టిన సూర్యోదయారాధనలో రెవరెండ్ హుల్దాశ్యామ్‌సన్ వాక్యోపదేశం చేశారు. కోశాధికారి విజయభాస్కర్, డికన్స్, కృపారాజన్, కృపాల్, వరప్రసాద్, జార్జిస్టీవెన్సన్, మేరీ సరళ, బ్లెస్సింగ్టన్ తదితరులు పాల్గొన్నారు.
- అలంకార్ సెంటర్‌లోని హెబ్రోన్ ప్రేయర్ హౌస్‌లో ఆరాధనలను రెవరెండ్ ప్రేమ్‌కుమార్ ఆధ్వర్యంలో జరిపారు.
- మూలాపేటలోని రామిరెడ్డిపేటలో గల తెలుగు సెకండ్ బాప్టిస్ట్ చర్చిలో సంఘ కాపరి శామ్యూల్ కిశోర్ వాక్యోపదేశం చేశారు. చైర్మన్ ఊరందూరు సురేంద్రబాబు, కార్యదర్శి కుమార్ పాల్గొన్నారు.
- బట్వాడిపాళెంలోని సెంటినరీ బాప్టిస్ట్ చర్చిలో రెవరెండ్ హరిపాల్ వాక్యోపదేశం చేశారు. సెక్రటరీ పాల్సన్ తదితరులు పాల్గొన్నారు.
- నీలగిరి సంఘంలోని హెబ్రోన్ బిలీవర్స్ అసెంబ్లీస్ చర్చిలో రెవరెండ్ డాక్టర్ డేవిడ్ దయాసాగర్ వాక్యోపదేశం చేశారు.
- పొదలకూరు రోడ్డులోని యునైటెడ్ క్రిస్టియన్ చర్చిలో సంఘ కాపరి రెవరెండ్ షారోన్ ఆధ్వర్యంలో.. వేదాయపాళెంలోని న్యూ గుడ్‌న్యూస్ బాప్టిస్ట్ చర్చిలో సంఘ కాపరి రెవరెండ్ రాజశేఖర్ దాసరి వాక్యోపదేశం చేశారు.
- వేదాయపాళెం రైల్వేస్టేషన్ సమీపంలోని ఆల్మా చర్చిలో రెవరెండ్ రూఫస్ కమలాకర్ వాక్యోపదేశం చేశారు.
- రైల్వేఫీడర్స్ రోడ్డులోని లోన్‌స్టార్ చర్చిలో బెన్హర్ బాబు ఆధ్వర్యంలో.. సంతపేటలోని జెమ్స్ ఆఫ్ జీసస్ చర్చిలో రెవరెండ్ జెరోమ్ ఆధ్వర్యంలో ప్రత్యేకారాధనలను నిర్వహించారు.
- సంతపేటలోని రోమన్ క్యాథలిక్ క్యాథెడ్రల్‌లో పునరుత్థాన సంగీత రూపక కార్యక్రమంలో స్వల్ప అపశ్రుతి చోటుచేసుకుంది. బాణసంచా కాలుస్తున్న సమయంలో అక్కడ వేసిన సెట్టింగ్‌లకు అగ్గి రాజుకుంది. నిర్వాహకులు సకాలంలో స్పందించడంతో భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగలేదు. ప్రత్యేక కార్యక్రమాలను బిషప్ ,ప్రకాశం ఆధ్వర్యంలో నిర్వహించారు.

శ్యామ్‌కు గిన్నిస్ రికార్డు



కోవూరు: మండలంలోని పడుగుపాడులో నివాసముంటున్న మేకనూరి శ్యామ్ గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డును దక్కించుకున్నారు. విజయవాడలో గతేడాది డిసెంబర్ ఒకటిన నిర్వహించిన అంతర్జాతీయ ఈవెంట్‌కు ఆయన హాజరయ్యారు. ఎనిమిది దేశాల నుంచి వచ్చిన 1046 మంది ఇందులో భాగస్వాములు కాగా, గంట పాటు కీ బోర్డును వాయించి వీడియోలను పోస్ట్ చేశారు. ఈ క్రమంలో గిన్నిస్ రికార్డుకు ప్రతినిధులు ఎంపిక చేశారు. ఈ తరుణంలో హైదరాబాద్‌లో ఇటీవల నిర్వహించిన కార్యక్రమంలో ఆయనకు మెడల్, సర్టిఫికెట్‌ను పాస్టర్ అగస్టీన్ దండంగి అందజేశారు.